ఉంటె వెంట పెట్టుకుని దీసుకురా' అని చెప్పి.. వంశీని గంట క్రితం బతిమాలి, అమ్మాజీ రాత్రిపూట ఉండే చోటుకు పంపించారు. వాడు వస్తున్నాడేమో.. వాడి వెంట అమ్మాజీ వస్తుందేమోనని గేటువైపే చూస్తుంటే, వంశీ ఒక్కడే వస్తుండటం చూసి నిరాశ పడ్డారు. విషయమేంటని అడిగితే చెప్పాడు.

''తెల్లవారుజామున అమ్మాజీ చనిపోతే, హాస్పిటల్ వాళ్లు వచ్చి తీసుకెళ్లింగ్రడట'' అని చావుకబురు చల్లగా చెప్పేసరికి, బలరామ్మూర్తి గారు కోడలు పద్మ వైపు చూశారు.. 'నీవే దిక్కు' అన్నట్లు.

ఆ చూపు అర్థమైనా గానీ పద్మ.. పట్టించుకోనట్టుగా..

''చచ్చిందాన్ని హాస్పిటల్‌కి దీసకపోయి ఏం చేస్తారంట? ఒక్కమాట ముందే ఒంట్లో బాగోలేదనో, ఇంకోటనో జెప్పుంటె.. ఈసరికి ఇంకో మనిషిని పెట్టుకుందుముగద. ఇట్ల చెప్పాపెట్టకుండ పోతే ఎట్ల!''

ఆవిడేదో పని ఎగ్గొట్టి పక్కూరుకి వెళ్లినట్టుగా, ఆవిడ ఏం చేసినా తన కనుసన్నల్లోనే జరగాలనే ఆలోచనతో.. ఆఖరికి ఆవిడ మహాప్రస్థానం కూడా తనకు చెప్పి చేయాలన్నట్టు అంది పద్మ.

తమకు అసౌకర్యంగా అనిపిస్తే ఎదుటి మనిషి ఏ పరిస్థితిలో ఉన్నా గానీ, వాళ్లనే తప్పుపట్టే మెంటాలిటీ ఉన్న మనుషులలో మొట్టమొదటి వరసలో ఉంటుందామె.

''ఇంగో మామయ్యా.. ఏనాడైన బైటనుంచి ఫుడ్ ఆర్డర్ బెడితె కడుపుకి పడలేదంటరుగా.. అయిన గానీ మరో మనిషి దొరికిందాక ఎవరైన సరే మాట్లాడకుండ అది తినాల్సిందే! తప్పదు. మీ కొడుక్కి గూడ ఫోన్ చేసి.. 'ఇంటి నుండి క్యారేజీ రాదు. ఆడ్నే క్యాంటీన్‌లో తిను' అని చెబుతాలె''.. అంటూ వెజ్‌మీల్స్ ఆర్డర్ పెట్టింది పద్మ.

ఒక్కపూట భోజనానికే నలుగురికీ వెయ్యి రూపాయిలైంది. పద్మ గుండె గుబేలుమంది. అదీ అమ్మాజీ ఉంటే.. ఇంటి పని, వంటపనీ కూడా పొద్దుటి నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ చేస్తుంది. మధ్యాహ్నం నాలుగు ముద్దలు, రాత్రి నాలుగు ముద్దలు అందరూ తిన్నాక.. మిగిలిపోయిన కూరలతో తినేసి వెళ్లిపోతుంది.

నెలకు కేవలం వెయ్యి రూపాయలు ఇవ్వమని పోస్టాఫీసులో కట్టుకుంటుంది. అత్తగారు పోయాక ఆమె కొత్తచీరలు కావాల్సిన వాళ్లకు ఇవ్వగా మిగిలిన పాత జరీచీరలు అమ్మాజీ కట్టుకుంటుంది. అంత తక్కువ జీతానికి మనిషి దొరకటమంటే కష్టమే.. ఒక్క పాచిపని చేయటానికే మూడువేలు అడుగుతున్నారు. ఇప్పుడు పద్మకేం చెయ్యాలో తోచటం లేదు. ఈ రోజులాగ ప్రతిరోజూ ఫుడ్ ఆర్డర్లు పెడితే.. భర్త సంపాదనలో సగం తిండికే సరిపోతుంది. ఇంక పిల్లల చదువులు, షాపింగులు, సరదాల సంగతేంటి.. తననీ అగమ్యగోచరంలో పడేసి, అకస్మాత్తుగా వంటింటిని వదిలేసి పోయిన అమ్మాజీ మీద మళ్లీ కోపం ముంచుకొచ్చింది కానీ.. ఎవరి మీద చూపించాలో తెలియక డైనింగ్ టేబుల్ పక్కనున్న కూర్చీని కాలితో తన్నింది. బొటనవేలు బొప్పి కట్టడం మినహా.. ఏం జరగ లేదు. కోడలి అవస్థ చూసి మనసులో చిన్నపాటి ఆనందం కలగగా, ఆమెనింకా ఉడికించాలన్నట్టుగా..

''ఏ మాటకామాటే చెప్పుకోవాలి పద్దమ్మా! చదువు సంధ్యా, తీరూ వాకా లేకున్నా.. వంట మాత్రానికి అమోఘంగా చేస్తది అమ్మాజీ. ఆ చేతిల ఏం మహిమ ఉందో ఏమో.. మన ఇంటిల్లిపాదీ కంచంలో ఒక్క మెతుకంటే ఒక్కటి కూడా ఉంచకుండా తినేస్తం..''

ఇంక ఆ వంట తినలేక పోతామే అన్న నిరాశతోనూ, ఇకనుండి రుచిపచీ లేని కోడలి వంట తినాల్సొస్తుందేమోనని భయంతోనూ బలరామ్మూర్తి గారు అంటుంటే.. ఈరోజు తాను చేసుకున్న ఉప్మా నోట్లో పెట్టుకున్నప్పుడే.. అమ్మాజీ వంట విలువ తెలిసొచ్చిన పద్మకి మామగారితో ఏకీభవించక తప్పలేదు.

* * *

గంట గడిచాక ఆర్డర్ చేసిన ఫుడ్ వచ్చేసింది. ఆవురావురంటూ గబగబా ప్యాకెట్స్ విప్పుకొని తినేశాక, కాస్త అన్నం కూర కలిపి స్నూపీ దగ్గరికి వెళ్లి.. దాని గిన్నెలో వెయ్యాలని చూస్తే.. పొద్దుట వేసిన ఉప్మా అలాగే ఉండే సరికి..

''ఏమే! నీకుగూడ నచ్చలే నా ఉప్మ! సర్లే ఇది తిను'' అని, గిన్నె ఖాళీ చేసి, అందులో అన్నం వేసి వెళ్లింది పద్మ.

స్నూపీ కడుపులో ఆకలి బాధ పెడుతున్నా సరే.. అన్నం గిన్నెలో మూతి పెట్టకుండా ఇంకా వంటగది తలుపువైపే చూస్తుండిపోయింది.

''ఇంగో మావయ్యా! ఈరోజు ఎట్లయిన వైకుంఠ ఏకాదశే గద! రాత్రికి ఉపాసం.. రేపటి ముచ్చట రేపు జూసుకుందాం గానీ.. ఎట్లయిన సరె పైసలెక్కువైన గానీ.. ఎవర్నొ ఒకర్ని పెట్టమని మీ కొడుక్కి జెబుదాంలె! అమ్మాజీ గాకుంటె ఇంకో బొమ్మాజీ..'' అంటూ తెలిసిన వాళ్లని చవకలో వచ్చే వంటమనిషి గురించి అడగటానికి ఫోన్ అందుకుంది పద్మ.

''అవునా.. ఈరోజు వైకుంఠ ఏకాదశా! ఎంత మంచి రోజున అమ్మాజీకి చావొచ్చె! ఏం పుణ్యం జేసుకుందో ఏవో గానీ.. డైరెక్టుగ స్వర్గానికే పోతది'' అన్నారు బలరామ్మూర్తి గారు.

''ఆ.. అవును! ఏం దెలియనమ్మకి ఏకాశి, అన్ని తెలిసినమ్మకి అమాస అని ఊర్కె అన్నరా!? విచిత్రం ఏంటంటె.. రోజూ పురాణాలు చదువుత, పూజా పునస్కారాలు జేస్త.. రెండుమార్లు కాశీకి పోయొచ్చిన.. అత్తమ్మకి,



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.